# నెలనెలా

'ఏమండీ'

'ఊఁ ఏమిటీ'

'యీ రోజు రెండో తారీకుకదా యింట్లో సరుకులన్నీ నిండుకున్నాయి కొన్ని ముఖ్యమైన వస్తువులు వెంటనే కావాలి'

'అలాగే ఏం కావాలో చెప్పు తీసుకొస్తాను'

'మీరెందుకు? నేను వెళ్ళి తెస్తాలెండి అయినా మొగవాళ్ళకన్నా ఆడవాళ్లే యీ రోజుల్లో షాపింగుకు ఎక్కువగా వెడుతున్నారు'

'సర్లే! నీకేం కావాలో లిస్టు రాయి'

'హేర్ పిన్స్ క్రొత్తవి కావాలండీ'

'ఓస్! యింతేనా యింకా'

'అన్నట్టు ఫేస్‌పౌడరూ, స్నో అయిపోయాయి యీ రోజు ముఖం వెలవెలపోతున్నట్లుంది'

'అలాగే తెచ్చుకో!'

'హేర్ ఆయిలూ, గోళ్ళరంగూకూడా అయిపోయాయి'

'సరే'

'అన్నట్లు క్రిందటి నెలలో కొన్న గాగుల్స్ ఓల్డ్ మోడలండీ పక్కింటి కనకాంబరం క్రొత్తరకం తెచ్చుకుంది చాలాబాగున్నాయి నేనూ అలాంటిదే'

'అసలు విషయం మరచేపోయాను క్రిందటి నెలలోకొన్న ఫారిన్ నైలెక్స్ చీర రెండుసార్లు తడిపితేనే అదోలా అయింది యీమాటు డార్క్ కలర్ ఒకటి తీసుకోవాలి క్రిందటి నెలలో కొన్న జోళ్ళ జత అరిగిపోతున్నట్లుగా ఉంది అదొకటి కొనాలి యింకా'

'అదేమిటండీ! అలా మాట్లాడకుండా కూర్చున్నారు పోన్లెండి-కోపమొచ్చిందా? యీ నెలకివి చాలులెండి మిగతావి వచ్చే నెల తెచ్చుకుందాం అన్నీ ఒకసారి తెచ్చుకోవడానికి మనమేమన్నా లక్షాధికారులమా అన్నట్టు బియ్యం కొట్టువాడికి క్రిందటినెల డబ్బివ్వలేదని అస్తమానూ అడుగుతున్నాడు అది యిచ్చెయ్యాలి ఆ! యిదెప్పుడూ వుండే గోలేలెండి అన్నట్టు మీకేమన్నా కావలిస్తే చెప్పండి ఎలాగూ అటు వెడుతున్నా కనక అవీ తెచ్చేస్తా'

'అలాగే చేర్చు నాకు ఒకే ఒక్కటి కావాలి'

'అదేమిటో చెప్పండి, తెచ్చేస్తాను.'

'జోలె!'

—నరసింహమూర్తి